క్లుప్తంగా

అనాథశరణాలయంలో పుట్టిన రోజు వేడుకలు


చిన్నారుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు యూనుస్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక నంద్యాల రోడ్డులోని అనాథ శరణాలయం, అంధుల పాఠశాలలో నిర్వహించారు. కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ ఆచారి, మహేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతయ్య, బేగ్ పాల్గొన్నారు.

ఇద్దరికి ఉచిత మక్కా యాత్ర


మిలాదున్ నబీ వేడుకలకు హాజరైన మహిళలు

కర్నూలు(రాజ్‌విహార్): మిలాదున్ నబీ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి స్థానిక లతీఫ్ లౌబాలి దర్గాలో తీసిన లక్కీ డిప్ డ్రాలో గఫ్పార్ వీధికి చెందిన నూర్ అహ్మద్, ఖడక్‌పురాకు చెందిన రుబీనా బేగం పవిత్ర మక్కా ఉచిత యాత్రకు ఎంపికయ్యారు. వీరిద్దరిని రూ.1.20 లక్షల చొప్పున ఖర్చు చేసే 20 రోజుల ఉమ్రాహ్ యాత్రకు సెంట్రల్ మిలాద్ కమిటీ తీసుకెళ్తుంది. అలాగే మరో ఆరుగురిని రాజస్తాన్‌లోని అజ్మీర్ యాత్రకు తీసుకెళ్లనున్నారు. వచ్చే ఏడాది ఐదుగురికి ఉమ్రా టికెట్లు, పది మంది పేద ముస్లిం జంటలకు ఉచితంగా వివాహాలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షులు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కర్నూలు (న్యూటౌన్): మిలటరీ కాలనీ నుంచి జి.పుల్లయ్య కాలేజ్, సూదిరెడ్డిపల్లె, వెంకాయపల్లె పరిధిలోని వెంచర్లకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కర్నూలు రూరల్ ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం మిలటరీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో కాలేజ్ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు 'నాజీవనయానం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఇంటలెక్చువల్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఈనెల 30 వ తేదీ సాయంత్రం 4 గంటలకు సిల్వర్ జుబ్లీ కళాశాలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి సోమరాజు రచించిన ఆత్మకథ 'నా జీవనయానం' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఖదీరుల్లా, ఇనాయతుల్లా గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

సంతాపం

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని మాసమసీదులో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటనారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ గురువారం మాసమసీదులోని వెంకటనారాయణరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ గిప్సన్, జెడ్పీటీసీ సభ్యులు గిరిజోన్ ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కల్లూరు : ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ రియాజ్, షేక్ హుసేన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు తడకనపల్లె గ్రామానికి చెందిన మహిళపై షేక్ రియాజ్ ఈనెల 23వ తేదీన రాత్రి సమయంలో అత్యాచారానికి ప్రయత్నించాడు. అయితే మహిళ గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. గురువారం బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ రియాజ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు అత్యాచారం కేసు, షేక్ హుసేన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు బెదిరింపు చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీమఠంలో న్యాయమూర్తులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి దర్శనార్థం పలువురు న్యాయమూర్తులు గురువారం మంత్రాలయం విచ్చేశారు. తెలంగాణలోని అలంపూర్ జోగులాంబ జిల్లా న్యాయమూర్తి కవిత, మరో జడ్జి శ్రీనివాస్ దర్శనం చేసుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసుకుని హారతులు పట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వాదం చేశారు. మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

గడప గడపకూ నిధులు

- నిధులు విడుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ
- 67 అభివృద్ధి పనులకు రూ.6.37 కోట్లు విడుదల
- ఇప్పటికే రూ.8.37 కోట్లతో 151 అభివృద్ధి పనులు పూర్తి
- ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌లు 1,365 సచివాలయాల పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులచే అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి పంపగా నిధులు మంజూరు చేస్తుండటంతో నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది.

రూ.6.37 కోట్లు విడుదల..

నగర పరిధిలో స్థానికుల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి గుర్తించి ప్రాధాన్యత క్రమంలో 67 పనులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ నాలుగు రోజుల క్రితం అనుమతులు మంజూరు చేశారు. నిధులు మంజూరుకు లైన్ క్లియర్ రావడంతో పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. మంజూరైన ఈ నిధుల ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలను ఎంపిక చేసి పనులు చేపట్టనున్నారు.

ఇప్పటికే పలు చోట్ల పనులు పూర్తి

రెండేళ్లలో నగరపాలక సంస్థకు పలు దఫాలుగా గడప గడప నిధులు మంజూరు అవుతున్నాయి. ప్రతిపాదనలు పంపడం, అనుమతులు తీసుకోవడం, పనులు పూర్తి చేయడం ద్వారా నిధులు సంబంధిత కాంట్రాక్టర్ల అకౌంట్లలో జమ అవుతున్నాయి. ఇప్పటికే ఈ పథకం ద్వారా ప్రతి సచివాలయాల పరిధిలో గుర్తించిన పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. ఇప్పటికే రూ.8.37 కోట్లతో నగరంలోని 52 వార్డుల పరిధిలో మురుగు కాల్వలు, కల్వర్టులు, సీసీ రోడ్లు, కంకర రోడ్లు, ప్యాచ్ వర్కులు పూర్తి చేశారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన కల్లూరు కాలనీలు, విలీన గ్రామాల్లోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మరో విడత నిధులు మంజూరు కావడంతో నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

త్వరలో పనులు ప్రారంభం

గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోంది. నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు సూచించిన సమస్యలను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి చేస్తున్నాం. ఇటీవలే మరోసారి గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ ప్రక్రియ చేపట్టి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం. – షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

గైనిక్ హెచ్‌ఓడీగా డాక్టర్ వెంకటరమణ


కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ విభాగాధిపతిగా డాక్టర్ ఎస్.వెంకటరమణ నియమితులయ్యారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు గైనిక్ హెచ్‌ఓడీగా ఉన్న డాక్టర్ ఎస్.మాణిక్యరావు పదోన్నతిపై అనంతపురం మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ కావడంతో డాక్టర్ వెంకటరమణ హెచ్‌ఓడీగా బాధ్యతలు స్వీకరించారు.

రెండు లారీలు పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా డోలమైట్ పౌడర్ తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున డోలమైట్ పౌడర్‌ను రెండు లారీల్లో తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెళ్లి తనిఖీ చేసి స్వాధీనం చేసుకుని, యజమానులకు రూ.1.12 లక్షల జరిమానా విధించామన్నారు. బనగానపల్లెకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి మైనింగ్ అధికారులు తనిఖీ చేయడానికి ఎక్కడెక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని జీపీఎస్ ద్వారా తెలుసుకొని లారీలు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నాడన్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేస్తున్న అతడిపై కేసు నమోదు చేస్తామని డీడీ తెలిపారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

గజరాజ గణనాథునికి ఘన వీడ్కోలు

- 56 అడుగుల భారీ మట్టి వినాయకుడికి ప్రతిష్టించిన చోటే నిమజ్జనం
- వేలాది మంది జన సందోహం మధ్యలో తుంగభద్రమ్మ ఒడిలోకి గణనాథుడు
- పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచి జలాభిషేకం చేయించుకున్న విఘ్నేశ్వరుడు


నీటితో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


నిమజ్జన వేడుకకు హాజరైన మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో 'గజరాజ గణపతి' నిమజ్జనం గురువారం శోభాయమానంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం తుంగభద్రా నది తీరంలో లక్ష్మీనరసింహ స్వామి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 56 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహానికి ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేశారు. పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచేలా ఏర్పాటు చేసిన ఈ గణనాథునికి ముందుగా పాలు, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. అనంతరం తుంగభద్రా నది నీటితో వేలాది మంది జన సందోహం మధ్య జలాభిషేకంతో తుంగభద్రమ్మ ఒడిలో కలిసిపోయాడు. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్‌ల ద్వారా వినాయకున్ని నీటితో తడుపుతూ నిమజ్జనం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అంతకు ముందు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త టీజీ భరత్, వన్‌టౌన్ సీఐ నాగశేఖర్, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా సమన్వయకర్త డాక్టర్ నాగఫణి శాస్త్రి, నగర ఉపాధ్యక్షులు కగ్గోలు హరీష్‌బాబు, గోరంట్ల రమణ, భజరంగ్‌దల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రతాప్ రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిమజ్జన పూజలో పాల్గొన్నారు. వినాయక లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా రూ.1.21 లక్షలకు భరత్ సిద్దూ కైవసం చేసుకున్నారు. హుండీకి వేలం నిర్వహించగా రూ.1.35 లక్షలకు గాజుల లావణ్య దక్కించుకున్నారు. అంతకు ముందు చిన్నారుల కోలాటం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


నిమజ్జనానికి హాజరైన నగర వాసులు


స్వామి వారికి పూజ చేసి, హారతి ఇస్తున్న పురోహితులు

ఆసుపత్రిలో రోగులకు దారి చూపిస్తాం

- మాజీ ఎంపీ బుట్టా రేణుక


ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని కలిసిన బుట్టా రేణుక

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నెలకొంది. ఇందులో ఏ విభాగం ఎక్కడుందో ఇక్కడ పనిచేసే వారికి సైతం ఒక్కోసారి ఠక్కున స్ఫురించదు. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల పరిస్థితి గురించి చెప్పనలవది కాదు. ఇలాంటి వారి కోసం తమ వంతు సహాయంగా దారి చూపిస్తామని బుట్టా ఫౌండేషన్ అధ్యక్షులు, మాజీ ఎంపీ బుట్టా రేణుక ముందుకు వచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డితో సమావేశమయ్యారు. ఏ విభాగం ఎక్కడుందో....ఏ జబ్బుకు ఎక్కడికి వెళ్లాలో తెలియక చాలా మంది రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతుంటారని డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆమెకు వివరించారు. ఇలాంటి వారికి దిక్సూచి మాదిరిగా దారి చూపిస్తే ఎంతో బాగుంటుందని సూచించారు. ఇందుకోసం స్వచ్ఛందంగా సేవ చేసే వారు ముందుకు రావాలని కోరారు. ఆ బాధ్యత తాము తీసుకుంటామని, ఎంత మంది కావాలో చెబితే సహాయకులను ఏర్పాటు చేస్తామని బుట్టా రేణుక హామీ ఇచ్చారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సేవలు నిరంతరం కొనసాగేలా చూస్తామని ఆమె చెప్పారు. దీనివల్ల రోగులు ఎక్కడికి, ఎలా వెళ్లాలో తెలియక అయోమయంలో సమయాన్ని వృథా చేసుకునే ఇబ్బంది తప్పుతుందన్నారు.

జాషువా రచనలతో సమాజం జాగృతి


జాషువా సాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అరసం రచయితలు

కర్నూలు కల్చరల్: సమాజ జాగృతికి జాషువా రచనలు దోహద పడ్డాయని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయ పడ్డారు. గురువారం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. అతిథులు, వక్తలు, సాహితీ వేత్తలు జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను దునుమాడిన ధీశాలి అన్నారు. అసమానతలు రూపు మాపడంలో జాషువా సాహిత్యం ఒక వజ్రాయుధంలా పని చేసిందన్నారు. అలాంటి సాహిత్యానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాషువా గబ్బిలం అనే మహా కావ్యం ద్వారా అంటరాని తనాన్ని, అస్పృశ్యతను తీవ్రంగా నిరసిస్తూ కుల మత రహిత సమాజం కోసం కలలు కన్నాడన్నారు.

- బీక్యాంప్ పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన జాషువా జయంతి సభలో తెలుగు కల్లం సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ చిన్నావుల వేంకటరాజారెడ్డి, సాహితీ వేత్తలు డాక్టర్ వి.పోతన్న, డాక్టర్ స్వరూప్ సిన్హా, ప్రకాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు చల్లా దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.
- కర్నూలు ఎస్టీయూ భవన్‌లో అరసం ఆధ్వర్యంలో నిర్వహించిన జాషువా జయంతి వేడుకల్లో సాహితీ వేత్తలు డాక్టర్ ఎం.హరికిషన్, జంధ్యాల రఘుబాబు, పెరికల రంగస్వామిలు పాల్గొన్నారు.
- కేకే భవన్‌లో జరిగిన వేడుకల్లో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.పి. బసవరాజు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా కన్వీనర్ జె.ఎస్. శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి


భరత్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు సిటీ: నగరంలో భరత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నగరంలోని ఓ కాలేజీలో భరత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకుడు

ఘనంగా భగత్ సింగ్ జయంతి

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పసుపుల గ్రామంలో భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువత స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పసుపుల గ్రామంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి వీరభద్రారెడ్డి, విజ్ఞాన పీఠం కార్యదర్శి గురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు వ్యాసరాజ్, సేవా సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మేల్ నర్సుపై దాడి ఘటనపై విచారణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ నెల 26న రాత్రి క్యాజువాలిటీలో విధుల్లో ఉన్న మేల్ నర్సు ఇర్ఫాన్‌పై దాడి ఘటనపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. విచారణ కమిటీలో మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మీబాయి, సైకియాట్రి హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కేవీ తులశమ్మ ఉన్నారు. వీరు మేల్ నర్సు ఇర్ఫాన్‌తో పాటు డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్సులు, సిబ్బంది, దాడికి పాల్పడిన వైద్య విద్యార్థులను పిలిపించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. ఈ క్రమంలో కొందరు వైద్య విద్యార్థులు, నర్సులు పెద్ద ఎత్తున విచారణ జరిగే ప్రాంతం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి కలుగజేసుకుని వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

ఇనుప ఖనిజం స్టాక్ యార్డు తనిఖీ

కర్నూలు (న్యూసిటీ): వెల్దుర్తి మండలం సర్పరాజాపురం గ్రామంలోని ఇనుప ఖనిజం స్టాక్ యార్డును గురువారం జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తనిఖీ చేశారు. తనిఖీలో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ బాల బాలికలకు న్యాయవాది జి.శ్రీధర్‌రెడ్డి గురువారం క్రీడాదుస్తులు వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ 29, 30 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని మార్టేర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో ప్రతిభ చాటి పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ ప్రతినిధి దాదాబాషా, సీఈఓ రమణ పాల్గొన్నారు.

విజేతలకు కప్పులు, ప్రశంసాపత్రాలు

స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలను న్యాయవాది గురువారం ప్రారంభించారు. బాలుర విభాగంలో మొదటి స్థానం ఆదర్శ విద్యా మందిర్ (కర్నూలు), ద్వితీయ స్థానం సాంఘిక సంక్షేమ పాఠశాల (సీ.బెళగల్), తృతీయ స్థానికంలో బాల బారతి స్కూల్ (ఓర్వకల్లు) నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం గురుకుల పాఠశాల (కంబాలపాడు), ద్వితీయ స్థానం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (ఎమ్మిగనూరు), మూడవ స్థానం సాంఘిక సంక్షేమ పాఠశాల (దిన్నెదేవరపాడు) జట్లు దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులు, కప్పులు, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు.

గిప్సన్ చర్చిలో సాంస్కృతిక పోటీలు


కొరియోగ్రఫీ పోటీల్లో నృత్యప్రదర్శన చేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరంలోని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చిలో వచ్చే 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న వార్షికోత్సవాల సందర్భంగా గురువారం సోలో సింగింగ్, కొరియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. కొరియోగ్రఫీ విభాగంలో గిప్సన్ సెంట్రల్ చర్చి మొదటి స్థానం, గుడ్‌షప్పర్డ్ రెండవ స్థానం, బేతేలు బాప్టిస్టు చర్చి సభ్యులు మూడవ స్థానంలో నిలిచారు. సోలో సింగింగ్ విభాగంలో మధురిమ రాజీవ్ (గిప్సన్ చర్చి) మొదటి స్థానం, ఎస్తేరు రాణి (బేతేలు బాప్టిస్టు చర్చి) రెండవ స్థానం, యూత్ క్విజ్ పోటీల్లో చిప్పగిరి ఏబీఎం చర్చి మొదటి స్థానం, తంగెడంచ రెండవ స్థానం, గిప్సన్ చర్చి మూడవ స్థానం సాధించారు. కార్యక్రమంలో గిప్సన్ సెంట్రల్ చర్చి పాస్టర్ పి.కృపాదానం రాజు, చర్చి అధ్యక్షులు వినోద్ జోషిఫర్, ఉపాధ్యక్షులు బి.దేవ ప్రసాద్, కోశాధికారి విక్రమ్ కుమార్, పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఆర్.ప్రశాంతి సామ్, సుగుణ సుధాకర్, సులోచన, సంపూర్ణ, అనిల్ కుమార్, దెబోర, ఐజక్, షారోన్‌లు వ్యవహరించారు. పోటీల నిర్వాహక కార్యదర్శి బి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ విజేతలకు వచ్చే నెల 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న చర్చి వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

భావి తరానికి సాహిత్యం ఎంతో అవసరం

కర్నూలు కల్చరల్: భావి తరానికి సాహిత్యం ఎంతో అవసరమని మార్కెట్ యార్డ్ మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. స్థానిక సాహిత్య సదన్ సమావేశ మందిరంలో జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రుల సమ్మేళనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్త, కవయిత్రులు హైదరాబాద్ సుజాత, చంద్రమౌళిని, నాగజ్యోతి, జ్యోత్స్న, సువర్ణ జోషి, సింగాడి శోభ, సుకన్య, మానంబి, బెన్నమ్మ, లీలావతి, చందన పాల్గొన్నారు.

నేడు రైతు బజార్‌కు సెలవు

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్ రైతు బజార్‌కు శుక్రవారం సెలవును ప్రకటిస్తున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్‌టెంట్ శివకుమార్ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రైతు బజార్‌ను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచేందుకు వీలుగా ఒక రోజు విక్రయాలకు సెలవు ప్రకటించి రైతు బజార్‌లో క్లీనింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. శనివారం రైతు బజార్‌లో యథావిధిగా అమ్మకాలు కొనసాగుతాయన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్.నెం. 136/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RASMECC) Kurnool Rep by its బ్రాంచ్ మేనేజర్ ..వాది

(వర్సెస్)

1. శ్రీమతి దేవరకొండ గంగాదేవి భర్త మండల పరశురామ్, ఇ.నెం. 78/8ఏ -14, న్యూక్రిష్ణానగర్, కర్నూలు.
2. వై.నాగమునెమ్మ భర్త లేట్ రంగస్వామి, ఇ.నెం. 87-1095045-3-3, ఇంపాల రెసిడెన్సీ దగ్గర, గణేష్‌నగర్-2, కర్నూలు ..ప్రతివాదులు

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులు అయిన మీ నుండి దావా మొత్తం రూ. 2,95,426/- లు ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాదులు అయిన మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 20-10-2023వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుగాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
యస్.షకీల్ అహ్మద్
వాదిపరం న్యాయవాది, కర్నూలు

భక్తిశ్రద్ధలతో మిలాదున్ నబీ వేడుకలు


మిలాదున్ నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నగరంలోని పాతబస్తీ లతీఫ్ లౌబాలి మసీదు నుంచి రాజ్‌విహార్ వరకు ర్యాలీ ర్యాలీ నిర్వహించారు.



వచ్చే ఏడాది నిర్వహించే వేడుకల ఫ్లెక్సీ విడుదల చేస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ తదితరులు